పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు : పెంచిన రూ.3వేలు పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని.. ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3 వేలుకు పెంచిన సందర్భంగా సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ఎన్నికల వరకు నెలకు రూ.1000 చొప్పున పింఛన్ ఇచ్చారని, అప్పట్లో ప్రతిపక్షనేతగా ఉన్న జగన్ పింఛన్ గురించి ప్రకటించాక చివరి నాలుగు నెలలు పింఛన్ మొత్తాన్ని రూ.2 వేలకు పెంచారన్నారు. అదే సీఎం జగన్ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ.2 వేలు ఉన్న పింఛన్‌ను విడతల వారిగా రూ.3 వేలకు పెంచడం జరిగిందన్నారు. ఇది పండుగ రోజు అని తెలిపారు. పేదలకు మేలు జరిగినందుకు మనస్ఫూర్తిగా సంతోషిస్తున్నానన్నారు. అందరూ మూడుపూటలా తిండి తినాలనే ఆశయంతోనే ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. నవరత్న పథకాల అమలుతో సువర్ణపాలన సాగుతోందన్నారు. పింఛన్ మొత్తాన్ని ఇంకా పెంచాలని తాను కోరుకుంటున్నానన్నారు.

■ మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి మాట్లాడుతూ జగనన్న మాట ఇచ్చిన ప్రకారం పింఛన్‌ను రూ.3 వేలకు పెంచారని, పింఛన్‌దారులు ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. మళ్లీ జగనన్న ప్రభుత్వాన్నే ఎన్నుకోవాలని కోరారు.

■ మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు పింఛన్లు అందుకునేందుకు లబ్ధిదారులు చాలా ఇబ్బందులు పడేవారని అన్నారు. ఈ ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకెళ్లి పింఛన్ అందిస్తోందన్నారు. ఇచ్చిన మాట మేరకు రూ.2750గా ఉన్న పింఛన్‌ను రూ.3వేలకు పెంచడం జరిగిందన్నారు. ప్రతి లబ్ధిదారుడికి ముఖ్యమంత్రి పింఛన్ డబ్బుతోపాటు కరపత్రాన్ని పంపించారన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 15,131 పింఛన్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

గుడిలోనో.. బడిలోనో పింఛన్ ఇచ్చేవారు

చంద్రబాబు ప్రభుత్వంలో పింఛన్ తీసుకోవాలంటే వృద్ధులు గుడికో.. బడికో వెళ్లాల్సి వచ్చేదని, వేలిముద్రలు పనిచేయలేదని మళ్లీ మళ్లీ తిప్పే పరిస్థితి ఉండేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం జరిగిన వైఎస్సార్ పెన్షన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాచమల్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 65 ఏళ్ల పింఛన్ వయసును 60 ఏళ్లకే తగ్గించిన కారణంగా ఎందరో పేదలు లబ్ధి పొందుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో అర్హతను బట్టి కాకుండా ఎదిరింటి వారో పక్కింటి వారో చనిపోతే పింఛన్ మంజూరయ్యేదన్నారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వానికి, జగన్ ప్రభుత్వానికి వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. గతంలో జన్మభూమి కమిటీలు డబ్బులు తీసుకుని పింఛన్లు ఎంపిక చేశారని అన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, ఎంపీడీఓ కుళ్లాయమ్మ, వైస్ ఎంపీపీలు ఆసం దస్తగిరి, రెడ్డమ్మ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఓబయ్య యాదవ్, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే

వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ చేసిన ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



మైదుకూరులో పింఛన్ సొమ్మును అందిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మైదుకూరు పట్టణంలో బుధవారం వైఎస్సార్ పెన్షన్ కానుక సంబరాల్లో భాగంగా ఆయన 14, 15 వార్డుల్లో ఇంటింటికి తిరిగి పింఛన్ సొమ్ము రూ.3వేలు లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డితో కలసి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పట్టణంలోని వినాయకనగర్, దర్గా వీధి, మదీనా మసీదు వీధుల్లో ఇంటింటికి తిరిగి పింఛన్ మొత్తాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.3వేలకు పెంచినట్టు పింఛన్‌దారులకు వివరించారు. పలువురు అవ్వా తాతలకు, దివ్యాంగులకు, వితంతువులకు ఎమ్మెల్యే పింఛన్ సొమ్ము అందించారు. అనంతరం 15వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకుడు అందే నాగార్జున స్వగృహంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం తలెత్తినా కరోనాతో రాష్ట్ర ఆదాయం పూర్తిగా తగ్గిపోయినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నారన్నారు. చంద్రబాబు 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా మహిళలకు, రైతులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేశారని ఆరోపించారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో 39 లక్షల మందికి రూ.1000 వంతున పింఛన్లు ఇచ్చేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ 66 లక్షల 34 వేల మందికి పింఛన్లు ఇస్తున్నారని తెలిపారు. ఇందు కోసం నెలకు రూ.1968 కోట్లు ఖర్చు చేశారని వివరించారు. జనవరి నుంచి రూ.3వేలు పింఛన్ తీసుకునేవారు నియోజకవర్గంలో 45 వేల మంది ఉన్నారని తెలిపారు. ఈనెల 23న నియోజకవర్గంలోని 56 వేల మంది డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా ఇవ్వనున్నారని అన్నారు. ఫిబ్రవరి 5వ తేదీన చేయూత కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు రూ.18,750 ఇవ్వనున్నారని ఎమ్మెల్యే వివరించారు. నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమం ఊసే లేదని విమర్శించారు. కార్యక్రమంలో 14, 15 వార్డుల ఇన్‌చార్జిలు ఖాదర్ బాషా, సన్న శ్రీనురావు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ షరీఫ్, సింగిల్ విండో అధ్యక్షుడు మూలె సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, కోఆప్షన్ సభ్యుడు ట్రాక్టర్ గౌస్, కౌన్సిలర్ వెంకటసుబ్బన్న, భరత్ కుమార్ రెడ్డి, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే గ్రామ స్వరాజ్యం



గంజికుంటలో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యం ఏర్పడిందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గంజికుంటలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఆయన ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ పింఛన్ కానుక సంబరాల్లో భాగంగా పంచాయతీలో కొత్తగా మంజూరైన వారికి, పాత పింఛన్‌దారులకు పెంచిన పింఛన్ సొమ్ము రూ.3వేలు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు పంటల సాగులో సలహాలు సూచనలు ఇప్పిస్తున్నారని అన్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచి అనేక రక్త పరీక్షలు నిర్వహించి, వైద్య సేవలు అందిస్తున్నారని, 120 రకాల మందులను ఇస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో కమలాపురం ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన శుద్ధి నీటి ప్లాంట్‌ను ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఈ ప్లాంట్‌కు రూ.6లక్షలు ఆర్థిక సాయాన్ని అందించినట్టు ఈ సందర్భంగా నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, స్థానిక నాయకులు మాజీ సర్పంచ్‌లు లెక్కల శివప్రసాద్ రెడ్డి, రామచంద్రారెడ్డి, సర్పంచ్ జయభారత్ రెడ్డి, లెక్కల వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి, మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న, పంచాయతీరాజ్ డీఈఈ మల్లేశ్వర్‌రెడ్డి, ఏఈ మధుసూదన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రొద్దుటూరు క్రైం : వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి శశిభూషన్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రోగ్రాం ప్రత్యేక అధికారి శశిభూషన్‌రెడ్డి తెలిపారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. రక్తపోటు, షుగర్, జ్వరాలు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్య కలిగిన ప్రజలు వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. స్పెషలిస్టు వైద్యులు గురు అభిలాష్, హిమబిందు, దినేష్, అప్తాల్మిక్ అధికారి తేజ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ప్రోగ్రాం ప్రత్యేక అధికారి పరిశీలించారు. 316 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శివప్రసాద్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్లు వెంకటేశ్వర్లు, శోభారాణి, కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎంవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

9న వెదురూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

చాపాడు : మండలంలోని వెదురూరు గ్రామంలో ఈ నెల 9న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాలైన పరీక్షలు చేసి రోగులకు అవసరమైన మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని వెదురూరు గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్యరంగంలో విప్లవాత్మక సంస్కరణలు



బద్వేలులో వృద్ధుడికి మందులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో ఆయన పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్, అర్బన్ హెల్త్ సెంటర్లు, ఫ్యామిలీ ఫిజీషియన్ వంటి కార్యక్రమాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారన్నారు. సిబ్బంది అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మీదేవి శ్రీరాములు, వైస్‌చైర్మన్ నాగసుబ్బారెడ్డి, కౌన్సిలర్ దుద్దుకూరు సత్యం, కోఆప్షన్ మెంబర్ రామచంద్రారెడ్డి, నాయకులు సాంబశివారెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పవిత్ర ఉమ్రా యాత్రకు ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష



యాత్రకు బయలుదేరిన డిప్యూటీ సీఎం

కడప కల్చరల్ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష పవిత్ర ఉమ్రా యాత్రకు బయలుదేరి వెళ్లారు. కడపకు చెందిన మదీనా హజ్ టూర్స్ అధినేత సయ్యద్ హబీబుల్లా బుఖారి ఆధ్వర్యంలో యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా సయ్యద్ హబీబుల్లా బుఖారి మాట్లాడుతూ పవిత్రమైన ఉమ్రా యాత్రలో ప్రపంచ శాంతి కోసం, ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు.

ఖైదీల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

కడప అర్బన్: ఖైదీల ఆరోగ్య విషయాలపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో బుధవారం కడప నగర శివార్లలోని కడప కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారంలో జడ్జి తమ సిబ్బందితో కలిసి పర్యటించారు. లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఆయన పరిశీలించారు.

ఏ ఒక్కరి నుంచి ఫిర్యాదు అందకూడదు



రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న డీఎస్‌ఓ చాముండేశ్వరి

ప్రొద్దుటూరు : బియ్యం అందలేదని ఏ ఒక్కరి నుంచి తమకు ఫిర్యాదు అందినా చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చాముండేశ్వరి పేర్కొన్నారు. డీఎస్‌ఓ బుధవారం ప్రొద్దుటూరు మండలంలోని అమృతానగర్, డీసీఎస్‌ఆర్ కాలనీ, మోడంపల్లె, జిన్నారోడ్డు ప్రాంతాల్లో రేషన్ పంపిణీ చేస్తున్న ఐదు వాహనాల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఎండీయూలు సక్రమంగా రేషన్ పంపిణీ చేస్తున్నారా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సరుకులు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు వెంకటకృష్ణ, నాగయ్య, ఎఫ్‌ఐ ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

ధర్మ, అధర్మ సంఘర్షణలో ధర్మానిదే విజయం



ఈశ్వరీదేవిమఠంలో భక్తులకు సందేశం ఇస్తున్న సుబ్బారెడ్డి

బ్రహ్మంగారిమఠం : ధర్మ, అధర్మం సంఘర్షనలో ధర్మానిదే విజయం. అందుకే మహాభారతాన్ని జయప్రబంధం అంటారని టీటీడీ ధర్మప్రచార పరిషత్ ప్రచార కర్త చాపాటి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం బి.మఠంలోని ఈశ్వరీదేవి మఠంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సుబ్బారెడ్డి సందేశం ఇస్తూ ఎవరైనా ధర్మాన్ని అతిక్రమిస్తే పతనం ఎలా జరుగుతుందో కౌరవుల ద్వారా చూపించారన్నారు. ధర్మం ఎక్కడ ఉంటుందో విజయం అక్కడ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈశ్వరీదేవి మఠం మఠాధిపతి వీరకుమార స్వామి, విశ్రాత ఉధ్యాయులు చెన్నారెడ్డి, రామిరెడ్డి, పెంచల్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

ప్రొద్దుటూరు క్రైం : ప్రభుత్వం తీసుకొచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులందరూ బుధవారం కోర్టు కాంప్లెక్స్ నుంచి శివాలయం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం శివాలయం సెంటర్‌లో మానవహారం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అబిద్‌హుస్సేన్, కార్యదర్శి వరదరాజులు, సీనియర్ న్యాయవాదులు ముడిమేల కొండారెడ్డి, గొర్రె శ్రీనివాసులు, దాదాపీర్, ఓబులేసు, జిలాని, సుధాకర్‌రెడ్డి, మైదుకూరు, జమ్మలమడుగుకు చెందిన న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళా లోకానికే ఆదర్శం సావిత్రిబాయి పూలే



బద్వేలులో సావిత్రిబాయిపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ



హెచ్‌ఎం రమాదేవిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



మహిళా ఉపాధ్యాయినులకు సన్మానం

బద్వేలు అర్బన్ : మహిళా లోకానికే ఆదర్శం సావిత్రిబాయి పూలే అని ఆర్డీఓ ఆకుల వెంకటరమణ తెలిపారు. సావిత్రిబాయిపూలే 193వ జయంతి సందర్భంగా బుధవారం ఉత్సవ కమిటీ చైర్మన్ వై.గోపాలస్వామి, పూలే ఆశయసాధన సమితి చైర్మన్ బి.గురుమూర్తిల ఆధ్వర్యంలో సిద్దవటంరోడ్డులోని పూలే సర్కిల్‌లోని సావిత్రిబాయిపూలే విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారత ప్రప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి అని, ప్రతి మహిళ సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలను, కౌన్సిలర్లను సన్మానించారు. అలాగే సావిత్రిబాయిపూలే క్యాలెండర్లను, జీవిత పుస్తకాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, సగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, వైవీయూ పాలక మండలి సభ్యులు కె.సి.సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ గిద్దలూరు అసెంబ్లీ పరిశీలకులు బంగారుశీనయ్య, పూలే విగ్రహ నిర్మాణ కమిటీ వైస్‌చైర్మన్ వెంకటస్వామి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బయ్యయాదవ్, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే

మైదుకూరు : మహిళల కోసం ప్రత్యేక పాఠశాలలను నెలకొల్పి మహిళల చదువుకు పాటుపడిన సావిత్రిబాయి పూలే ఆదర్శ ఉపాధ్యాయిని అని వక్తలు పేర్కొన్నారు. బుధవారం మైదుకూరు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశంలోనే మహిళల చదువు కోసం పాటుపడిన వ్యక్తి సావిత్రి బాయి పూలే అని కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రమాదేవిని ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో పలువరాళ్లపల్లె హైస్కూల్ హెడ్మాస్టర్ బండి సత్యనారాయణ, ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామమోహన్, ఎస్టీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మీసాల మునెయ్య, తవ్వా ఓబుళరెడ్డి, పద్మజ, రమాదేవి, చౌడేశ్వరి, స్వర్ణలత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిభాయిపూలే జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అధికారులు కాశయ్య, రత్నస్వామి పాల్గొని సావిత్రిభాయికి నివాళి అర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయినులకు శాలువలు కప్పి, జ్ఞాపికలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ది బీసీ ప్రజా చైతన్య సమాఖ్య కార్యాలయంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. సమాఖ్య అధ్యక్షుడు రామాంజనేయులు, సమాఖ్య సభ్యులు జింకా మార్కండేయ, సంటియ్య, వుట్టి వీరయ్య, జీసీ పుల్లయ్య, భాస్కర్, రవీంద్ర, ఆదినారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

• క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని దొరసానిపల్లె జెడ్పీహైస్కూల్‌లో బుధవారం యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌లను ఎంఈఓ -2 శోభారాణి ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రవీంద్రుడు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 11వ పీఆర్సీ అరియర్స్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. 12వ పీఆర్సీని సంక్రాంతి పండుగలోపు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కొండారెడ్డి, గుర్రప్ప, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్..

కలసపాడు : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఏపీటీఎఫ్–257 2024 నూతన సంవత్సర క్యాలెండర్ మరియు డైరీని మండల విద్యాశాఖాధికారులు పి.జె.ప్రేమ్‌సాగర్, ఎస్.మస్తాన్‌వలి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.కవిత ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై ముందుండి పోరాటాలు నిర్వహించి సమస్యలను సాధించడంలో ఈ సంఘం గొప్ప పాత్రను పోషించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యకుడు ఇ.బాలజోజి, మండల అధ్యక్షుడు కె.క్రిష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.బాలఓబయ్య, ఆర్థిక కార్యదర్శి బి.ప్రభాకర్, సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాశినాయన : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ ప్రేమ్‌సాగర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొండుశెట్టి, నాగరాజుల ఆధ్వర్యంలో ఏపీటీఎఫ్ (257) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాంభూపాల్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్టీయూ..

మండలంలోని ఎంఈఓ కార్యాలయంలో బుధవారం మండల విద్యాశాఖాధికారి పి.ఎం.ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మండల కార్యవర్గ సభ్యులు పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలతో పాటు విద్యారంగ సమస్యలపై పోరాటం సాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల కార్యదర్శి సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌జీఓ అసోసియేషన్



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు

బద్వేలు అర్బన్ : బద్వేలు తాలూకా ఎన్‌జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అవసరమైన జీవోలను పొందుపరిచి రూపొందించిన క్యాలెండర్ వారికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి శివరామిరెడ్డి, ఉపాధ్యక్షులు మల్లికార్జునరావు, వెంగయ్య, జాయింట్ సెక్రటరీ వెంకటమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మదుసూదన్‌రెడ్డి, యూనియన్ నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రొద్దుటూరు : తమ ఆందోళనలో భాగంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం పంగనామాలు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. మంత్రుల బృందంతో తమ యూనియన్ నాయకులు జరిపిన చర్చలు విఫలమయ్యాయని యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు విజయకుమార్ తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవికుమార్, మోహన్, గుర్రమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ నాయకుల నిరసన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద బుధవారం డీవైఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్ మాట్లాడుతూ మెగా డీఎస్సీ విడుదల చేయాలని విజయవాడలో డీవైఎఫ్ఐ నాయకులు విద్యాశాఖ మంత్రి కార్యాలయాన్ని ముట్టడించగా పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారన్నారు. డీఎస్సీ కోసం లక్షలాది మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు రవి, బాలు, శీను, మహేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పోరుమామిళ్ల : సావిత్రిభాయి పూలే జన్మదిన సందర్భంగా పోరుమామిళ్ల మండల ఉపాధ్యాయులు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని 55 మంది మహిళా ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. మండల విద్యాశాఖ అధికారులు కాశయ్య, రత్నస్వామిలు సావిత్రిభాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి ఘటించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులకు శాలువలతో సన్మానం చేశారు.

రేపు ఈశ్వరీదేవి ఆరాధన మహోత్సవం

బద్వేలు అర్బన్ : స్థానిక మైదుకూరు రోడ్డులోని శ్రీఈశ్వరీదేవి ఆశ్రమంలో శుక్రవారం ఈశ్వరీదేవి సజీవ యోగ సమాధి నిష్ఠ వహించిన పవిత్రదినం సందర్భంగా జగన్మాత శ్రీఈశ్వరీదేవి ఆరాధన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకులు సుబ్బరాయుడుస్వామి తెలిపారు. ఉదయం 5 గంటలకు ఈశ్వరీదేవి సుప్రభాతం, సూక్త పారాయణం, 7 గంటలకు పంచామృతాభిషేకం, సహస్రనామ, కుంకుమార్చన, 9 గంటలకు శ్రీచక్ర నవవర్ణ కుంకుమార్చన, నవగ్రహ, చండీ శాంతి హోమము తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ ఆరాధన మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామ సమీపంలోని కుందూ నది హైలెవెల్ వంతెనెపై అక్రమంగా మద్యం అమ్ముతున్న ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన గాలిపోతుల అబ్రహంను బుధవారం పట్టుకున్నట్లు ఏఎస్ఐ పుత్తా సుబ్బారెడ్డి తెలిపారు. అతని వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.


అక్షింతలు పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరం, మిట్టమటి, నాగేంద్ర నగర్ ప్రాంతాల్లో బుధవారం అయోధ్య నుంచి తెచ్చిన శ్రీరాముని అక్షింతలను, శ్రీరామ మందిరం కరపత్రాలు, స్టిక్కర్లను విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు బద్వేలి నాగమునిరెడ్డి మాట్లాడుతూ 3000 మందికి శ్రీరాముని అక్షింతలు, కరపత్రాలు, స్టిక్కర్లను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్రహైస్కూల్ కరస్పాండెంట్ పల్లేటి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుంటిమల్లారెడ్ల కాలనీ ప్రారంభం

మైదుకూరు : మండలంలోని ఉత్సలవరంలో బుధవారం కుంటిమల్లారెడ్ల కాలనీని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి ఎమ్మెల్యేను, కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి తదితరులను సత్కరించారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా కేశవరెడ్డి



బద్వేలు అర్బన్ : స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకేశంపల్లె గ్రామానికి చెందిన గాజులపల్లె కేశవరెడ్డిని నియమిస్తూ సీఎం కార్యాలయం నుంచి బుధవారం ఉత్వర్వులు వెలువడ్డాయి.

ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి తనకు ప్రాధాన్యత కల్పిస్తూ రాష్ట్రస్థాయి డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన కడప ఎంపీ వైఎస్‌అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలకు కృతజ్ఞతలు తెలిపారు.